



సండే స్పెషల్

కల్యాణ వైభోగమే

ట్రెండు మారిన వివాహ సందడి.. మధురజ్ఞాపకంగా పెళ్లి వేడుకలు



- పల్లకీలో పెళ్లికూతురు.. గుర్రపు స్వారీపై వరుడి ఊరేగింపు
- గుర్తుండిపోయేలా ఏడడుగుల బంధం
- వేడుకల్లో ఎక్కడ చూసినా స్పెషల్ సాంగ్‌లు
- అభిరుచులకనుగుణంగా కార్యక్రమాలు



ఓ వివాహ వేడకలో నిర్వహిస్తున్న పసుపు దంపుళ్లు (ఫైల్)

పెళ్లంటేనే సంప్రదాయ పద్ధతిలో కొనసాగే తంతు. మంగళస్నానాల నుంచి అప్పగింతల వరకు ఆనవాయితీ ప్రకారంగా కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. ప్రస్తుతం వివాహ సందడి ట్రెండ్ మారుతోంది. పెళ్లిని మధురజ్ఞాపకంగా నిలుపుకునేందుకు పాత పద్ధతుల మేళవింపుతో కొత్త రకమైన హంగు ఆర్భాటాలతో వైభోగంగా, పదికాలాలపాటు గుర్తుండిపోయేలా చేసుకుంటున్నారు. ఎంగేజ్‌మెంట్ నాటి నుంచే ఇరు కుటుంబాలు ప్రణాళికల్లో మునిగితేలుతున్నారు. ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్‌తో ప్రారంభించి సరికొత్త కార్యక్రమాలతో సందడిగా పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. అమ్మలక్కల పసుపు దంపుళ్లు.. ఒకే రకమైన వస్త్రధారణలో ఆకర్షణీయంగా వేసిన సెట్టింగ్‌లో హుషారెత్తించే పాటలతో చిందేస్తూ హల్దీ ఫంక్షన్.. వధువుతో పాటు

ఆకర్షణీయమైన సెట్టింగ్‌తో హల్దీ ఫంక్షన్ (ఫైల్)

వచ్చిన వారందరీ చేతులు ఎర్రగా పండేలా మెహందీ వేడుక.. గుర్రంపై వరుడి ఊరేగింపు.. కల్యాణ వేదిక వద్దకు మహరాణిలా పల్లకీలో వచ్చే పెళ్లికూతురు.. పూలదారిలో గుర్తుండిపోయేలా ఏడడుగులు నడవడం.. అరుంధతీ వీక్షణం.. మిరుమిట్లుగొలిపే విద్యుత్‌కాంతుల మధ్య చిన్నాపెద్ద చిందేసే బరాత్... ఇలా కల్యాణ వైభవాన్ని ఆహాఓహో అనిపించేలా నిర్వహిస్తున్నారు.



7

మహిళలు, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలి

షీటీమ్స్ సమీక్షలో సీపీ బి.అనురాధ



సిద్దిపేట క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : మహిళలు, పిల్లల రక్షణకు పెద్ద పీట వేయాలని సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ బి.అనురాధ షీటీమ్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆమె కమిషనర్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షీటీమ్ సహాయం కోరి వచ్చే మహిళలు పిల్లల పట్ల గోప్యత పాటించాలని సూచించారు. సంబంధిత ఏసీపీలు వారానికి ఒక రోజు షీటీమ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. మహిళలకు, ఆడపిల్లలకు షీటీమ్ రక్షణ కల్పిస్తుందని భరోసా ఇచ్చే విధంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులు, పిల్లలతో కాసేపు మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. టీచర్లు కూడా స్కూల్‌కు వచ్చే అమ్మాయిల ప్రవర్తనలో మార్పు వస్తే వెంటనే సంబంధిత షీటీమ్ సిబ్బందికి తెలియపరచాలన్నారు. సోషల్ మీడియాలను చూడకుండా తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. అమ్మాయిల మైండ్ సెట్ మారే విధంగా కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. పోక్సో కేస్ స్టడీలను తెలియపరచి అవగాహన కల్పించాలని సూచించారు. ఈవ్ టీజింగ్ జరిగే హాట్‌స్పాట్‌ల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. హాట్‌స్పాట్ పరిసర ప్రాంతాల్లో కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, సీసీ నితిన్‌రెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, డివిజన్ల షీటీమ్ సిబ్బంది, సిద్దిపేట భరోసా కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పైసలు ఇస్తే పర్మిషన్ అవసరం లేదా?

టపాసుల దుకాణదారుల నుంచి ఫైర్‌సేఫ్టీ అధికారుల వసూళ్లు

కుకునూరుపల్లి, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా మండల కేంద్రంలో పలువురు టపాసుల దుకాణాలను ఏర్పాటు చేశారు. దీపావళి రోజు గజ్వేల్ నుంచి నలుగురు అధికారులు మండల కేంద్రంలోని టపాసుల దుకాణదారుల నుంచి డబ్బు వసూలు చేసినట్లు తెలిసింది. గురువారం రాత్రి ఓ సీఐ, కానిస్టేబుల్ వచ్చి దుకాణాలకు అనుమతి ఉందా అని అడిగి లేని వాటిని ఎందుకు ఏర్పాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. ప్రజ్ఞాపూర్, కొండపాకలోని అన్ని అనుమతులు తీసుకొని ఏర్పాటు చేసిన టపాసుల దుకాణదారులు ఫిర్యాదు మేరకు తనిఖీలకు వచ్చామని కుకునూరుపల్లే కాకుండా జగదేవ్‌పూర్, ప్రజ్ఞాపూర్, కొండపాకలోనూ తనిఖీలు చేశామన్నారు. టపాసుల దుకాణదారులు వారికి రూ.500 ఇవ్వగా ఇది సరిపోదని ఇంకా ఎక్కువ డిమాండ్ చేసినట్లు తెలిసింది. అనంతరం దుకాణదారుల నుంచి రూ.1000 నుంచి రూ.2000 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. దీనిపై గజ్వేల్ ఫైర్ సేఫ్టీ సీఐ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా తమ సిబ్బంది ఎవరూ కుకునూరుపల్లికి రాలేదని ఎవరి నుంచి డబ్బు వసూలు చేయలేదని తెలిపారు.



బెజ్జంకిలో పత్తి తరలిస్తున్న ప్రైవేటు వ్యాపారులు

పత్తి రైతు పరేషాన్

కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయం

- జిల్లాలో 24 సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- ఇప్పటివరకు ప్రారంభమైంది ఒక్కటే
- 9 లక్షల క్వింటాళ్ల దిగుబడి అంచనా
- క్వింటాలు పత్తికి రూ.7,521 మద్దతు ధర
- రూ.6 వేలే చెల్లిస్తున్న ప్రైవేటు వ్యాపారులు

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఈ సీజన్‌లో పత్తి రైతులు పరేషాన్‌లో పడ్డారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఇంకా ప్రారంభించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల నుంచి అక్కడక్కడ వర్షాలు కురుస్తుండడంతో పత్తి తడిస్తే తేమ పేరిట నష్టపోతామని వాపోతున్నారు. కొనుగోళ్లు ప్రారంభమవుతాయని ఎదురుచూసి.. చూసి తప్పక కొందరు రైతులు ప్రైవేట్ వ్యాపారులు వైపు మొగ్గు చూపుతున్నారు.

1.10 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లా వ్యాప్తంగా 1.10 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. 9 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి రానున్నదని అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది ప్రభుత్వం పత్తికి క్వింటాల్‌కు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. కానీ ఇప్పటివరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో నాణ్యమైన పత్తి క్వింటాలుకు రూ.6 వేల నుంచి రూ.6,500 ప్రైవేటు వారికి విక్రయిస్తున్నారు. క్వింటాలుకు రూ.1000 నుంచి రూ.1500పైగా నష్టపోతున్నా తప్పక విక్రయిస్తున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరుతున్నారు.

గతేడాది 7.45 లక్షల క్వింటాళ్ల కొనుగోలు

గతేడాది సీసీఐ 47,366 మంది రైతుల నుంచి 7.45 లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేసింది. 2.48 లక్షల క్వింటాళ్లు ప్రైవేట్ వారు కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో 9 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి రానున్నదని అధికారులు అంచనాలు వేశారు. ఈ మేరకు జిల్లాలో 24 సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు

తరువాయి 8వ పేజీలో



దున్న విన్యాసం

సదర్ సంబురం

తొగుట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాన్గల్ గ్రామంలో శనివారం రాత్రి సదర్ ఉత్సవాలను సంబురంగా నిర్వహించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల సంస్కృతి సమ్మేళనం సదర్ అని పేర్కొన్నారు.



ఆసనం వేస్తున్న విద్యార్థి

ఉమ్మడి జిల్లా యోగా ఎంపికలు

7

ప్రాణం తీసిన వడ్ల కుప్పలు

- ఇద్దరు బిడ్డలతో తల్లిగారింటికి బయలుదేరిన తల్లి
- వారిని బస్టాప్‌లో దిగబెట్టేందుకు వచ్చిన బావ కూడా..
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి
- పోతారం ప్రమాదం మిగిల్చిన విషాదం



రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

మనోహరాబాద్, నవంబరు 2 (ఆంధజ్యోతి): తల్లిదండ్రుల కొత్త ఇంట్లో జరిగే శుభకార్యానికి ఇద్దరు ఆడబిడ్డలను తీసుకుని ఆ తల్లి బయలుదేరింది. వారిని బస్టాప్‌లో దిగబెట్టేందుకు బావ (భర్త పెద్దన్న) ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వెళ్తున్నాడు. అదే వారి చివరి ప్రయాణం అవుతుందని, ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ మృత్యువుగా వారి ప్రాణాలు హరించి వేస్తుందని వారు ఊహించలేదు. రోడ్డుపై కొందరు ఆరబెట్టిన ధాన్యం కుప్పలు ప్రమాదానికి కారణమవుతాయనీ ఎవరూ ఊహించలేదు. కానీ, అనుకోని సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు.. అందులో ఇద్దరు బాలికలు దుర్మరణం చెందారు. శనివారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పోతారం గ్రామంలో ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీ కొన్న ఘటన మిగిల్చిన విషాదం ఇది.

పోతారం గ్రామానికి చెందిన మన్నె ఎల్లయ్య-సాలమ్మలకు నలుగురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఆడబిడ్డకు పెళ్లి చేసి అత్తారింటికి పంపారు. నలుగురు అన్నదమ్ములు గ్రామంలో వేర్వేరుగా ఉంటూ వ్యవసాయం చేసుకుంటారు. వ్యవసాయ పనులు లేని సమయంలో కూలి పనులకూ వెళ్తారు. ఇందులో చిన్న కుమారుడు కుమార్‌కు భార్య మన్నె లావణ్య(30), మన్నె సహస్ర(9), మన్నె శ్రావ్య(7)లు ఉన్నారు. మన్నె లావణ్య తల్లిదండ్రులు వారి స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా, వర్గల్ మండలం మజీద్‌పల్లిలో కొత్త ఇల్లు కట్టుకున్నారు. గృహ ప్రవేశం సందర్భంగా మన్నె లావణ్య పిల్లలతో బయలుదేరింది. భర్త కుమార్

మిగతా 7వ పేజీలో



రోదిస్తున్న మృతుల కుటుంబ కుటుంబ సభ్యులు, న్యాయం చేయాలని ధర్నా చేస్తున్న బంధువులు, గ్రామస్తులు



శనిగరం ప్రాజెక్టు

శనిగరం ప్రాజెక్టుకు 133 ఏళ్లు



చతరస్రాకారంలోని తూము



1891 నాటి శిలాఫలకం

నిజాం కాలం నాటి చెక్కుచెదరని చెరువు

ఐదు వేల ఎకరాలకు సాగునీరు.. మత్స్యకారులకు జీవనాధారం

కోహెడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు గుట్టలు.. వాటిపై పరుచుకున్న పచ్చని అందాలు.. వాటి దిగువన జల సవ్వడితో కనువిందు చేసే ప్రాజెక్టు శనిగరం. జిల్లాలోని కోహెడ మండల పరిధిలోని శనిగరం, అనంతసాగర్ గ్రామాల సమీపంలో సిద్దిపేట నుంచి కరీంనగర్ వెళ్లే దారిలో రాజీవ్‌రహదారికి కూతవేటు దూరంలో ఉంది. 1887లో ఆరో నిజాం నవాబు మీర్ మహబూబ్ అలీఖాన్ పాలనలో 4,827 ఎకరాల్లో నిర్మాణం ప్రారంభించిన చెరువు 1891లో పూర్తయింది. 133 ఏళ్లుగా చెక్కుచెదరకుండా శనిగరం చెరువు వేలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నది.

నిజాం కాలం నాటి శనిగరం చెరువే నాటి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే పెద్ద చెరువు. ఈ జలాశయాన్ని అప్పటి చీఫ్ ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ పర్యవేక్షణలో నిర్మించారు. ఈ పురాతన జలాశయం నిర్మాణానికి 560 సీర్లు (504 కిలోల బంగారం ధర) ఖర్చు చేశారు. చెరువు తూము చతురస్రాకారంలో ఉంటుంది. తూము, ఆనకట్టను నున్నటి బండరాళ్లు ఒకదానిపై ఒకటి పేర్చి వాటి మధ్యలో సీసం, దంగునున్నం, బంకమట్టి వేసి నిర్మించారు. చెరువు నిండా నీరున్నా నేటి వరకు ఒక్క చుక్క లీక్ కాలేదంటే నాడు చేపట్టిన పనులు అద్భుతంగా ఉండడమే కారణమని పలువురు అంటున్నారు. శనిగరం జలాశయం పూర్తి సామర్థ్యం 42 అడుగులు. 2005లో దీనిని మధ్యతరహా ప్రాజెక్టుగా మార్చు చేశారు.

తరువాయి 8వ పేజీలో


మంగళ స్నానాల సెట్టింగ్


ఎదురు కోళ్లకు గుర్రపు బగ్గీ


ముత్యాల పందిరి..

కల్యాణ వైభోగమే

ట్రెండు మారిన వివాహ సందడి.. మధురజ్ఞాపకంగా పెళ్లి వేడుకలు


నవరత్న తలంబ్రాలు

- పల్లకీలో పెళ్లికూతురు.. గుర్రంపై వరుడి ఊరేగింపు
- గుర్తుండిపోయేలా ఏడడుగుల బంధం
- వేడుకల్లో ఎక్కడ చూసినా స్పెషల్ సాంగ్‌లు
- అభిరుచులకనుగుణంగా కార్యక్రమాలు



సండే స్పెషల్

కొండపాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి అంటే పందిళ్లు, సందళ్లు, తప్పెట్లు.. తాళాలు.. తలంబ్రాలే కాదు పల్లకీలు... ఊరేగింపులూ కావాలంటున్నారు నేటి యువత. పల్లకీలో పెళ్లికూతురు రాణిలా ఉంది... మహారాణిలా ఉంది.... అని అంటుంటే సంతోషించని వారు ఎవరుంటారు. ఆడబిడ్డల తల్లిదండ్రులు ఆ మాట వినేందుకు ఎంతో ఉత్సుకత కనబరుస్తారు. అందుకే ఆ ఆనందాన్ని పొందాలని చాలామంది తమ గారాల కూతురిని పల్లకీలో ఊరేగిస్తున్నారు.

15 రోజుల సందడి

పూర్వం 15 రోజులకు పైగా పెళ్లి సందడి ఉండేది. కొంతకాలం తర్వాత రెండు రోజుల్లో వివాహ సందడి ముగించడం పరిపాటిగా మారింది. కానీ ప్రస్తుతం నిశ్చితార్థం నుంచి మొదలై ప్రీ వెడ్డింగ్ షూట్, సంగీత్, మెహందీ ఫంక్షన్, అప్పగింతలు, వివాహ తంతు, రిసిప్షన్ వంటి కార్యక్రమాలతో పూర్వంలాగే 15 రోజులకు పైగా పెళ్లి సందడి కనిపిస్తున్నది.

పెళ్లిళ్ల సందడి షురూ..

ప్రస్తుతం పెళ్లిళ్ల సందడి షురువైంది. రెండు నెలల విరామం తర్వాత వరుస ముహూర్తాలతో వివాహాలకు సిద్ధమవుతున్నారు. జీవితంలో మరుపురాని మహత్తర ఘట్టాన్ని జీవితాంతం గుర్తుండిపోయే విధంగా నిర్వహించేందుకు పల్లె, పట్నం అని తేడాలేకుండా ప్రజలు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఖర్చుకు ఏమాత్రం వెనకాడకుండా వివాహ వేడుకలను నిర్వహిస్తున్నారు.

కారుపోయి పల్లకీ వచ్చే...

గతంలో పల్లకీలు పోయి, వాటి స్థానంలో పూలతో అలంకరించిన ఖరీదైన కార్లు వచ్చాయి. అయితే ఇటీవల కొందరు సంప్రదాయ పద్ధతిని అనుసరిస్తూ పల్లకీల వైపు ఆసక్తిని కనబరుస్తున్నారు. దీంతో మాయమైనవి అనుకున్న పల్లకీలు మళ్లీ మనకళ్ల ముందు కదలాడుతున్నాయి. కేవలం ఊరేగింపు సమయంలోనే కాక పెళ్లి మండపంలోకి వచ్చే సందర్భంలోనూ సరదాగా వధువును పల్లకీలో తీసుకువస్తున్నారు. శోభాయమానంగా రూపుదిద్దుకుని ఉన్న పల్లకీల్లో నూతన దంపతులను అంగరంగ వైభవంగా ఉరేగిస్తున్నాయి. అలాగే పెళ్లి కొడుకులను గుర్రంపై ఉరేగిస్తూ పెళ్లి మండపానికి తీసుకు వస్తున్నారు. మేనా, డోలీ, పల్లకీ ఇలా.. రకరకాల పేర్లతో వివిధ డిజైన్లలో పల్లకీలు అందుబాటులో ఉంటున్నాయి.

సినిమాలకు ధీటుగా ప్రీ వెడ్డింగ్ షూట్....

మర్చిపోలేని రీతిలో.. మధుర జ్ఞాపకంలా యువతీ యువకులు పెళ్లికి సిద్ధమవుతున్నారు. సినిమాలను తలదన్నేలా ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా పెళ్లికి ముందే ప్రీ వెడ్డింగ్ షూట్లు చేసుకుంటున్నారు. సినిమా తరహా మాదిరిగా సినీ, జానపద గీతాలపై కాబోయే జంటలు వీడియో షూట్లో చేసి వాటిని పెళ్లి జరిగే రోజు ఎల్‌ఈడీ స్క్రీన్‌లతో ప్రదర్శిస్తూ సరదాగా గడుపుతున్నారు. అందుకోసం ప్రత్యేక ఏర్పాటు చేసుకుంటున్నారు.


పల్లకీలో పెళ్లి కూతురు..

అభిరుచులకు అనుగుణంగా..



వివాహాల ట్రెండు మారింది. అభిరుచులకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం. జీవితకాల మధుర జ్ఞాపకంగా పెళ్లి జరగాలంటే అనేక అంశాలు ముడిపడి ఉంటాయి. ఎంగేజ్‌మెంట్ నుంచి అప్పగింతల వరకు అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

– అన్నమయ్య పవన్, హరిణి, కల్చరల్ ఈవెంట్స్ నిర్వాహకులు

వారమైతే లండన్ తిరిగి వెళ్లేవాడు..
అంతలోనే అనంతలోకాలకు


సాయికిశోర్‌రెడ్డి(ఫైల్)

వెల్దుర్తి, నవంబరు2(ఆంధ్రజ్యోతి) : విదేశం నుంచి సొంత గ్రామానికి వచ్చిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వెల్దుర్తి మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన వెన్నవరం మహిపాల్‌రెడ్డి, ఇందిర దంపతులకు కుతూరు, ఇద్దరు కుమారులు సంతానం. కూతురు వివాహం జరగగా, ఇద్దరు కుమారులు లండన్‌లో చదువుకుంటున్నారు. కళాశాలకు సెలవులు రావడంతో ఇద్దరు స్వగ్రామానికి వచ్చారు. రెండు రోజుల క్రితం సుచిత్రలో ఉన్న మరో ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం సాయికిశోర్ రెడ్డి(24) బైకుపై వెళ్తుండగా సుచిత్ర సర్కిల్ సమీపంలో బైకు అదుపు తప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వారం రోజుల్లో తిరిగి విదేశానికి వెళ్లాల్సి ఉండగా, అంతలోనే మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

ఉమ్మడి జిల్లా యోగా ఎంపికలు

సిద్దిపేట కల్చరల్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో స్థానిక టీటీసీ భవన్‌లో శనివారం ఉమ్మడి జిల్లా యోగా సెలక్షన్స్ నిర్వహించారు. అండర్ 14, అండర్ 17 బాల, బాలికల విభాగాలవారీగా మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి సుమారు 150 యోగా క్రీడాకారులు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సౌందర్య తెలిపారు. ట్రెడిషనల్ యోగా, అర్టిస్టిక్ యోగా, రిథమిక్ యోగా విభాగాల నుంచి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. వరంగల్ జిల్లాలో అండర్ 17 బాల బాలికల విభాగం, కామారెడ్డి జిల్లాలో అండర్ 14 బాల బాలికల విభాగం రాష్ట్రస్థాయి పోటీలు నవంబరు 8 నుంచి 10వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు.

ప్రాణం తీసిన వడ్ల కుప్పలు

5వ పేజీ తరువాయి..

ఓ పౌల్ట్రీ ఫాంలో పని ఉండటంతో వెళ్లాడు. తన పెద్దన్న ఆంజనేయులును కొంచెం తన భార్యా బిడ్డలను తూప్రాన్- నర్సాపూర్ రోడ్డుపై ఉన్న బస్టాప్ వద్ద దింపమని కోరారు. దీంతో శనివారం తన ద్విచక్ర వాహనంపై మరదలు, ఆమె ఇద్దరు ఆడపిల్లలను తీసుకుని అంజనేయులు బయలుదేరాడు. వారి వాహనం గ్రామ శివారుకు రాగా, ఎదురుగా అదే గ్రామానికి చెందిన ఒకరి ట్రాక్టర్ గ్రామంలోకి వస్తోంది. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అంజనేయులు, మన్నె లావణ్య, ఆమె ఇద్దరు పిల్లలు సహస్ర, శ్రావ్యలు అక్కడికక్కడే మృతి చెందారు. చనిపోయిన సహస్ర ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి, శ్రావ్య రెండో తరగతి చదువుతున్నారు. అంజనేయులుకు భార్య సుజాత, ఒక కుమార్తె భానుప్రియ ఉన్నారు.

రోడ్డుపై ధాన్యం వల్లే ప్రమాదం..

పోతారం గ్రామం నుంచి తూప్రాన్-నర్సాపూర్‌కు వెళ్లే రోడ్డుపై కొందరు స్థానిక రైతులు ధాన్యం ఆరబెట్టారు. దీంతో వాహనాలు ఒక వైపు నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ వేగంగా వచ్చి నలుగురు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. నలుగురు వాహనంపై నుంచి కిందపడి చెల్లాచెదురుగా పడి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన సమాచారం అందిన వెంటనే గ్రామం నుంచి బంధువులు, కుటుంబ సభ్యులు పెద్దఎత్తున సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాలపై పడి రోధించారు. 'సంతోషంగా తల్లిగారింటికి బయలుదేరి.. పిల్లలతో సహా కనిపించకుండా పోయావా' అంటూ రోదించారు. దిగబెట్టి వస్తానని వెళ్లిన వ్యక్తి అనంతలోకాలకు వెళ్లాడని ఆంజనేయులు మృతదేహాన్ని చూసి అక్కడి వారు కన్నీరుమున్నీరయ్యారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకట్‌రెడ్డి సందర్శించారు. తమకు న్యాయం చేయాలని మృతుల బంధువులు ఘటనా స్థలంలో ఆందోళన చేశారు.

'ఉపాధి హామీ'లో లోపాలు

● సామాజిక తనిఖీ ప్రజావేదికలో బహిర్గతం


కోహీర్‌లో ఉపాధి పనులపై నిర్వహిస్తున్న ప్రజావేదిక

కోహీర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై శనివారం ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రమైన కోహీర్‌లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో రూ.5.58 కోట్లతో చేపట్టిన పనుల్లో చోటుచేసుకున్న పొరపాట్లను చదివి వినిపించారు. ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది తనిఖీ బృందానికి పంచాయతీరాజ్ పనులకు సంబంధించిన రికార్డులు చూపించలేదని వారు సభా దృష్టికి తీసుకువచ్చారు. పీచేర్యగడి తండా, పర్శపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనుల రికార్డులను అప్‌డేట్ చేయలేదని, గురుజువాడలో పంచాయతీ కార్యదర్శి సంతకాలు లేకుండా బిల్లులు చేసినట్లు గుర్తించారు. పలు గ్రామ పంచాయితీల వద్ద పే స్లిప్స్ అందుబాటులో ఉంచడం లేదని, పూర్తి స్థాయిలో కూలి డబ్బులు కూడా చెల్లించడంలేదని తేల్చారు. ఎంపీడీవో, ఏపీవోలు పర్యవేక్షణ కొరవడడంతో ఒకరికి బదులు మరొకరు పనులు చేసినట్లు చెప్పారు. ఖానాపూర్ గ్రామంలో పూర్తి స్థాయిలో మొక్కలు పెంచలేదన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్, ఏపీడీ బాల్‌రాజ్, ఎంపీడీవో భారతి, అధికారులు పద్మావతి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన రేవంత్ సర్కార్

● ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులను రేవంత్ సర్కార్ విస్మరించిందని, ప్రతిపక్షాలను తిట్టడంలో ఉన్న శ్రద్ధ రైతులపై ముఖ్యమంత్రికి లేదని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం అందుబాటులోకి వచ్చి నెల రోజులు గడుస్తున్నా తూకం వేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారన్నారు. వ్యవసాయరంగానికి పెద్దపీట వేయకుండా హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో కాలయాపన చేయడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే కాళేశ్వరం ప్రాజెక్టుకే రూ.లక్ష కోట్లు దాటలేదు.. కానీ మూసీ సుందరీకరణకు రూ.లక్షా యాభై వేల కోట్లు వెచ్చించడమేమిటో అని విస్మయం వ్యక్తం చేవారు. రైతు భరోసా అమలుచేస్తూ, రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాలని డిమాండ్ చేశారు. రైతులను నిర్లక్ష్యం చేస్తే వారి పక్షాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.


సిద్దిపేట కల్చరల్‌లో నియామక పత్రాలతో ఎంపికైన అభ్యర్థులు

స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు కౌన్సెలింగ్

● 25 మందికి పాఠశాలల కేటాయింపు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2024 ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో శనివారం నియామక కౌన్సెలింగ్ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి జిల్లాలోని 25 పాఠశాలకు పోస్టింగులు ఇచ్చారు. ఇందులో 24 జడ్పీ పాఠశాలలుండగా, ఒకటి ప్రభుత్వ యాజమాన్య పాఠశాల ఉన్నది. వారు నేడు సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఏడీ శంకర్, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, సీఎంవో వెంకటేశం, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, నాగభూషణం, రఘు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాలో 27 మందికి...

సిద్దిపేట కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : స్కూలు అసిస్టెంట్, ఎస్జీటీ(స్పెషల్ ఎడ్యుకేషన్) అభ్యర్థులకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏడుగురు స్కూలు అసిస్టెంట్లు, 20 ఎస్‌జీటీలకు నియామక పత్రాలు అందజేశారు. మొత్తం 35 పోస్టులకు 27 పోస్టులు భర్తీ చేయగా.. మరో స్కూలు అసిస్టెంట్, 7 ఎస్‌జీటీ పోస్టులు ఖాళీలు ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తదుపరి ఉత్తర్వుల ప్రకారం ఖాళీల భర్తీ ఉంటుందన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ రంగనాథ్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే కాలనీలో పది మద్యం బెల్టుషాపులు

● డీఎస్పీ, ఎక్సైజ్ సీఐకి కాలనీ వాసుల ఫిర్యాదు

పటాన్‌చెరు, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవాణినగర్ కాలనీ మద్యం బెల్ట్‌షాపులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు పది బెల్ట్‌షాపులు నడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ మేరకు శనివారం కాలనీవాసులు ఏకమై పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, పటాన్‌చెరు సర్కిల్ ఎక్సైజ్ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. బెల్టు షాపులతో కూలీనాలీ చేసుకునే నిరుపేదలు, యువత మద్యానికి బానిసై రోడ్లపై నిత్యం హంగామా సృష్టిస్తూ మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రవీందర్‌రెడ్డి కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్త, వెంకన్న, వల్లభ, సురేష్, కృష్ణ, రమణ, తిరులేష్, నర్సింహగౌడ్ తదితరులు ఉన్నారు.


డీఎస్పీ రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న శ్రీవాణీనగర్ కాలనీ వాసులు

డీసీసీబీ చైర్మన్ కారు ఢీకొని
మహిళ మృతి.. ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు


ప్రమాదానికి గురైన కారు

గజ్వేల్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్ కారు... మరో కారును ఢీకొట్టగా మహిళ మృతి చెందింది. గజ్వేల్ సీఐ సైదా కథనం ప్రకారం సికింద్రాబాద్‌కి చెందిన మహ్మద్‌రజా తన కుటుంబ సభ్యులు మహ్మద్‌జమీల, ఖజీమ్, సకీనాలుతో కలిసి కారులో జనగామ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో గజ్వేల్ మండలం రిమ్మనగూడ శివారులో ఓ హోటల్ వద్ద భోజనం చేసి రోడ్డు దాటుతుండగా వారి కారును మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన నలుగురిని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మహ్మద్ జమీల అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మిగతా ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

శివనామస్మరణను అలవర్చుకోవాలి

●రాంపూర్ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి


స్వామివారికి అభిషేకం చేస్తున్న మాధవానంద సరస్వతి

గజ్వేల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు శివనామస్మరణను అలవర్చుకోవాలని రాంపూర్ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి అన్నారు. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లోని శ్రీ పార్థివేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దైవనామ చింతనతో మానసిక ఆనందం లభిస్తుందన్నారు. అలాగే శ్రీవీరాంజనేయ స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఆలయ పూజారి బెజుగామ విఠల్‌శర్మ, దేశపతి రాజశేఖర్‌శర్మ ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు అర్చిత


అర్చిత

మెదక్ అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో మెదక్ జిల్లా చందంపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని అర్చిత ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో జరుగుతున్న పోటీల్లో స్టోరీ టెల్లింగ్‌లో విభాగంలో అర్చిత ప్రతిభ కనబర్చింది. మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. అదే విధంగా డాన్స్‌లో ఐశ్వర్య గ్రూప్, వాయిద్యాల పోటీల్లో అఖిల్‌కు ప్రోత్సాహక బహుమతులతోపాటు జ్ఞాపిక, నగదును విద్యాశాఖ అదనపు డైరెక్టర్ రాజీవ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆ విద్యార్థులను కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఈవో రాధాకిషన్, ఏఎంవో సుదర్శనమూర్తి, ఎంఈవో పుష్పవేణి, కమిటీ సభ్యులు అంజాగౌడ్, మాధవరెడ్డి, వంశీకృష్ణ, గైడ్ టీచర్లు మాధవి, ప్రభు, రహీం అభినందించారు.


కాజీపల్లిలో అధునాతన హంగులతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనం

ప్రభుత్వ బడికి కార్పొరేట్ హంగులు

- పరిశ్రమ సహకారంతో అధునాతన భవనం
- రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మాణాలు
- ప్రైమరీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు
- వచ్చే నెలలో అందుబాటులోకి..

జిన్నారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కాజీపల్లిలో అధునాతన హంగులతో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణం పూర్తి కావస్తోంది. కెంటెక్ పరిశ్రమ రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పాఠశాల భవనం ఆధునిక హంగులతో నిర్మాణం జరుపుకోగా నవంబరులో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అధునాతన వసతులు..

మండలంలోని పారిశ్రామిక పంచాయతీ కాజీపల్లిలో ప్రాథమిక పాఠశాలను ఆధునిక వసతులతో నిర్మించారు. గతంలో ఉన్న పాఠశాల భవనాల స్థానంలో నూతన నిర్మాణాలు చేపట్టారు. ఏడాది కాలంగా జరుగుతున్న పనులు చివరి దశకు చేరుకోగా నవంబర్ 14 బాలల దినోత్సవం రోజున ప్రారంభోత్సవానికి కసరత్తు చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా ఇక్కడే నిర్మించారు. విద్యార్థుల సంఖ్య, భవిష్యత్ అవసరాలు దృష్టిలో ఉంచుకుని విశాలమైన తరగతి గదులు, ఫ్లోరింగ్, వాష్‌రూంలు, గాలి, వెలుతురు వచ్చేలా భవనం నిర్మించారు. గదుల్లో పూర్తి స్థాయిలో ఫర్నీచర్ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.

డిజిటల్ తరగతుల నిర్వాహణకు ఏర్పాట్లు..

నూతన పాఠశాల భవనంలో డిజిటల్ తరగతుల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ సత్యనారయణ తెలిపారు. స్థానిక పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో గ్రామంలో విద్య, వైద్యం, మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని సామాజిక బాధ్యతతో ఇతర పరిశ్రమలు కూడా సహకారం అందించాలని కోరారు.



పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

హుస్నాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నంగునూర్ మండలం అక్కెనపల్లికి చెందిన బండి మహేందర్ (37) హుస్నాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తూ హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నివాసముంటున్నారు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని పోలీసులు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోహెడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ పి అభిలాష్ తెలిపారు. మండలంలోని తంగళ్లపల్లి గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి శనివారం అక్రమంగా రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్న గ్రామానికి చెందిన చొప్పరి లింగం, రాయవేని కుమార్‌కు చెందిన ట్రాక్టరును పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత

సిద్దిపేట క్రైం, నవంబరు 2: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు బాధితులకు అప్పగించారు. సిద్దిపేటకు చెందిన సాయికుమార్, నవీన్, రవి అనే వ్యక్తులు తమ ఫోన్లు పోయాయని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గతంలో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, పోగొట్టుకున్న వ్యక్తులకు సీఐ వాసుదేవరావు అందజేశారు.

పదేళ్లుగా ప్రారంభానికి నోచలేదు!?

- లక్షలు ఖర్చు.. ఫలితం శూన్యం
- కాంగ్రెస్ హయాంలో నిర్మాణం.. బీఆర్ఎస్ హయాంలో నిరుపయోగం
- పిచ్చి మొక్కల నడుమ రాజీవ్ యువకేంద్రం
- వినియోగంలోకి తేవాలని వేడుకోలు


బెజ్జంకి క్రాసింగ్‌లో రాజీవ్ యువ కేంద్రం భవనం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

బెజ్జంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నిర్మించిన రాజీవ్ యువ కేంద్రం భవనం పది సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంది.

ఎన్నికల ప్రభావంతో

రాజీవ్ రహదారి పక్కన 2013లో రూ. 20 లక్షలతో రాజీవ్ యువ కేంద్రం భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత అప్పటి ప్రభుత్వం డీఆర్డీఏ అధికారులకు అప్పగించింది. ఆ సమయంలోనే ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం మారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడింది. రాజీవ్ యువ కేంద్రంలో జిమ్ సామగ్రి, గ్రంథాలయం, ఫర్నిచర్, ఇతర సామగ్రి ఏర్పాటు చేయాల్సి ఉండగా ఏ ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో నాటి నుంచి నేటి వరకు యువ కేంద్ర భవనాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో భవనం చుట్టూ పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి చెత్త చెదారంతో నిండిపోయింది. ఈ భవనాన్ని నిర్మించిన మొదట్లో అప్పటి కలెక్టర్, జేసీ పరిశీలించి అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటివరకు అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

అందుబాటులోకి తెస్తే ఉపయోగం



బెజ్జంకి క్రాసింగ్‌లో నిర్మించిన రాజీవ్ యువ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువస్తే యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో పాటు యువజన సంఘాల సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు భవనాన్ని పరిశీలించి అందుబాటులోకి తీసుకురావాలి.

- కనగండ్ల తిరుపతి, యువకుడు, బెజ్జంకి క్రాసింగ్

సదుపాయాలతో అందుబాటులోకి..



యువతకు పలు అంశాల్లో శిక్షణ నైపుణ్యాన్ని పెంపొందించేందుకు వసతులు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలి. ఎవరూ పట్టించుకోకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. రాజీవ్ యువ కేంద్రం భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి. భవనం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి.

-టేకు తిరుపతి, యువకుడు, బెజ్జంకి క్రాసింగ్

చిగురించిన ఆశలు

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రాజీవ్ యువకేంద్రం భవనం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపయోగంగా మారింది. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి ప్రారంభిస్తారని మండలంలోని యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రాజీవ్ యువ కేంద్రం భవనంపై ప్రత్యేక దృష్టి సారించి భవనాన్ని పరిశీలించి అందుబాటులోకి తీసుకువస్తే ఉపయోగకరంగా ఉంటుందని యువకులు కోరుతున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్


కుకునూరుపల్లి: సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కుకునూరుపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్ ఆదేశించారు. కుకునూరుపల్లి పీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ.. సాధారణ డెలివరీలను ప్రోత్సహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఆయనవెంట అధికారులు ఉన్నారు.

- సిద్దిపేట టౌన్: డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్‌ను రాష్ట్ర మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ (హెచ్1) యూనియన్ జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, కార్యదర్శి మహేందర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎంఅండ్‌హెచ్‌వోను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, లింగమూర్తి, లింగంగౌడ్, రాజ్‌కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు నష్టపోకుండా కులగణన చేపట్టాలి'

సిద్దిపేట కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నష్టపోకుండా కులగణన చేపట్టాలని పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి అదరాశిపల్లి శశిధర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేపట్టిన కులగణనకు తాము సహకరిస్తామని, కలగణన కోసం కేవలం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మాత్రమే కేటాయించటం సరికాదన్నారు. దీనివల్ల ప్రాథమిక విద్యకు తీవ్ర నష్టం వాటిల్లితుందని ఆందోళన వ్యక్తం చేశారు.

- జగదేవ్‌పూర్: పాఠశాలలకు అంతరాయం కలగకుండా కులగణన సర్వే నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకట్‌కిరణ్ డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘాలతో డిప్యూటీ సీఎం నిర్వహించిన సమావేశంలో చెప్పిన అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోకుండా విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు.

బీసీ కులగణన సర్వేను విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ నాయకులు


మాట్లాడుతున్న కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తలపెట్టిన బీసీ కులగణన సర్వేను విజయవంతం చేయాలని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సిద్దిపేట పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ.. బీసీ కులగణన సర్వేలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బీసీ కులగణన సర్వే ద్వారా బీసీలందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో లలితా సహస్రనామ పారాయణం

చేర్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిత్యం మల్లన్న, శివనామస్మరణతో ప్రతిధ్వనించే కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం శనివారం లలితా సహస్రనామ పారాయణంతో మారుమోగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఆలయంలో మల్లన్నకు విశేష అర్చన నిర్వహించారు. ఆలయ ముఖమండపంలో సుహాసినీలచే దీపారాధన చేపట్టి లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లయ్య, అర్చకసంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, అర్చకులు మహదేవుని సాంబయ్య, పడిగన్నగారి మల్లేశం మహదేవుని మనోహర్, స్థానికులు, వీరశైవాగమ వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో భాగమే వీక్లీ పరేడ్

- ఏఆర్ అదనపు డీసీపీ రామచంద్రరావు


పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా వీక్లీ పరేడ్ నిర్వహిస్తామని ఏఆర్ అదనపు డీసీపీ రామచంద్రరావు అన్నారు. పెద్దకోడూర్ గ్రామ శివారులో ఉన్న సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో శనివారం జిల్లాలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్, హోంగార్డ్ సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్‌కు ఆయన హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఇన్‌స్పెక్టర్లు వాసుదేవరావు, ఉపేందర్, ప్రవీణ్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణ చందర్, ప్రసాద్, రాజేష్, ధరణికుమార్, ఆర్ఎస్ఐలు రోహిత్, వెంకటరమణ, బాలకృష్ణ, ఎస్ఐలు అపూర్వరెడ్డి, బాలకృష్ణ, చంద్రయ్య, కొమురయ్య ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి

- డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి


కొండపాకలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొండపాక, దమ్మకపల్లి, వెలికట్ట తదితర గ్రామాల్లో శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కనకరాములు, లింగారావు, సురేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

- మద్దూరు: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి. రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. దళారులకు తక్కువ ధరకు విక్రయించి మోసపోరాదన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, సీసీ ప్రేమలతతో పాటు నిర్వాహకులు కలకలక్ష్మి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఒక్క గింజా కొనలేదు

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలలో ఒక్క గింజ ధాన్యం కొనుగోలు కాలేదని, రైతులు ఆరుగాలం శ్రమించి తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలల్లో తడుస్తుంటే ఇప్పటి వరకు స్పందించిన దాఖలాలు లేవని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. దుబ్బాకలోని మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం అన్నింటా విఫలమైందన్నారు. రైతులను నిండాముంచుతున్నారని, బోనస్ ఇస్తామని ఎన్నికలల్లో గెలిచిన కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. కొనుగోలును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట ఆర్. రాజమౌళి, పీఏసీఎస్ చైర్మన్ శేర్లకౌలాస్, అధికం బాలకిషన్‌గౌడ్, ఆస యాదగిరి, ఎల్లారెడ్డి, ఆసస్వామి, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.


దుబ్బాక: మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల లోని పలువురి మృతుల కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు.

- మద్దూరు: మండలంలోని రేబర్తి సహకార సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో ఎంతో ఆర్భాటంగా ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభించినా మిల్లుల అలాట్‌మెంట్ కాకపోవడంతో నిర్వాహకులు ధాన్యం సేకరణం చేపట్టడం లేదు. మండలంలోని రేబర్తి సహకార సొసైటీ ఆధ్వర్యంలో 14, ఐకేపీ ఆధ్వర్యంలో 6 కొనుగోలు కేంద్రాలను పక్షం రోజుల క్రితం ప్రారంభించారు. వచ్చిన ధాన్యాన్ని కాంటా పెట్టలేని స్థితిలో నిర్వాహకులు ఉన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నిక రాజ్యాంగ విరుద్ధం

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్

గజ్వేల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రతిపాదిస్తున్న ఒకే దేశం.. ఒకే ఎన్నిక.. ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ ఆరోపించారు. సీపీఐ గజ్వేల్ మండల ఆరో మహాసభలు శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. ఇక రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గజ్వేల్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా సందిటి రంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కమిటీ సభ్యులుగా బండ్ల స్వామి, సధాకర్, వెంకటాచారి, అయిలయ్య, ఎండీ హమ్మద్, స్వామి, మహాలక్ష్మి, రాణిలను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న శశిధర్

'పత్తి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి'

గజ్వేల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడలో పత్తి రైతలతో ఆయన శనివారం మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు పత్తిని విక్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి: బీజేపీ


తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

చేర్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ భూములు కబ్జాకు గురికాకుండా పరిరక్షించాలని కోరుతూ కొమురవెల్లి మండల బీజేపీ నాయకులు శనివారం ఆలయ ఏఈవో శ్రీను, తహసీల్దారు లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు బూరుగోజు నాగరాజు మాట్లాడుతూ.. మల్లన్న ఆలయ పరిధిలోని భూముల్లో పలువురు అక్రమ నిర్మాణాలు చేపట్టి కబ్జా చేస్తున్నారని, అధికార పార్టీ నాయకుల అండదండలతో అధికారులను ప్రలోభాలకు గురిచేస్తూ అన్యాక్రాంతానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గనబోయిన శ్రీనివాస్, పుట్ట కనకయ్య, జనగామ తిరుపతి, సానాది కర్ణాకర్, బచ్చలి రాజు, తడకపల్లి కనకయ్య, నరెడ్ల నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలసదనం సందర్శన

సిద్దిపేట క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి ఆదేశాల మేరకు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి శనివారం సిద్దిపేట పట్టణంలోని బాలసదనంను సందర్శించారు. మొదట పిల్లలతో మాట్లాడి వారి బాగోగులను తెలుసుకున్నారు. బాలసదనంలో భోజన నాణ్యత, వంటగది పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట వార్డెన్ రజిత, సీడబ్ల్యూవో భాగ్య, అకౌంటెంట్ వరలక్ష్మి, ఏఎన్ఎం ప్రణీత ఉన్నారు.

సులభమైన విధానంలో విద్యాబోధన చేయాలి

- ఎంఈవో సత్తయ్య

కుకునూరుపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సులభమైన విధానంలో బోధించాలని మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య ఉపాధ్యాయులకు సూచించారు. బొబ్బాయిపల్లి, కోలోనిపంపు పాఠశాలను శనివారం ఎంఈవో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు సులభమైన రీతిలో అర్థమయ్యే విధంగా బోధించాలని, వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ చైర్మన్

గజ్వేల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలసి దీపావళి శుభాకాంక్షలను తెలియజేశారు. ఆయనవెంట మున్సిపల్ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, బొగ్గుల చందు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండె మధు, సీనియర్ నాయకులు తలకొక్కుల దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

డీజిల్‌లో నీరు వస్తుందని రైతుల ఆందోళన

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 2: మండలంలోని కిషనగర్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో డీజిల్‌లో నీరు వస్తుందని రైతులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఓ రైతు బంక్‌లో ట్రాక్టర్‌లో డీజిల్ పోసుకుని వెలుతుండగా మార్గ మధ్యలో ట్రాక్టర్ ఆగిపోయింది. ట్రాక్టర్ ఆగిపోవడమేమిటని ఆ రైతు బంకు వద్దకు వచ్చి నిర్వాహకులను ప్రశ్నించాడు. నిర్వాహకులు తమకేమీ తెలియదని రైతును దబాయించారు. దీంతో ఆ రైతు మరో ఖాళీ బాటిల్‌లో డీజిల్ పోయించుకున్నాడు. బాటిల్‌లో డీజిల్ పైన నీళ్లు కిందకి చేరడంతో కల్తీ డీజిల్ పోస్తున్నారని అక్కడ ఉన్న రైతులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. బంక్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- గజ్వేల్ ఎంఈవో కృష్ణ

గజ్వేల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో కృష్ణ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19, అండర్-17, అండర్-14 బాలబాలికల జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలో ఉమ్మడి జిల్లాకు చెందిన 250మంది బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్యల, అండర్-19 సిద్దిపేట జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సమ్మయ్య, గజ్వేల్ ఎస్జీఎఫ్ కార్యదర్శి భవానీ, వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయరేఖ, రవికుమార్, నగేశ్, భాను, ప్రశాంత్, ఆంజనేయులు, మురళీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- మర్కుక్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ, సిద్దిపేట జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి శివకుమార్ అన్నారు. మండలంలోని దామరకుంటలో శనివారం ఏకలవ్య కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు.


ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో, జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి

శనిగరం ప్రాజెక్టుకు 133 ఏళ్లు

ఐదో పేజీ తరువాయి

ఒక టీఎంసీ సామర్థ్యం గల ప్రాజెక్టుగా గుర్తించి అప్పటి ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేసింది.

తొమ్మిది గ్రామాలకు సాగునీరు

కోహెడ, బెజ్జంకి మండలాల్లోని తొమ్మిది గ్రామాలైన శనిగరం, తంగళ్లపల్లి, బెజ్జంకి, రేగులపల్లి, పోతారం(జె), దాచారం, ముత్తన్నపేట్, గాగిళ్లాపూర్, గుగ్గిళ్ల తదితర గ్రామాల్లోని 5,100 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మరో ప్రత్యేకత ఏంటంటే ఈ రిజర్వాయర్ నిండినా ఎలాంటి ప్రమాదం లేకుండా వాటంతట అవే పడి పోయేలా ఫాలింగ్ గేట్లను మొదటగా అమర్చారు. ఈ తరహా గేట్లు తుప్పు పట్టడంతో ఆధునీకరించి కొత్త గేట్లు మార్చారు. రైతులకు, మత్స్య కార్మికులకు ఈ చెరువు కల్పతరువుగా మారింది. గంగమ్మ, దాయాల మత్తడి కాలువల ద్వారా వేలాది ఎకరాలు సస్యశ్యామలం అవుతున్నాయి.

మత్స్యకారులకు ప్రయోజనం

శనిగరం ప్రాజెక్టు చేపపిల్లల ఉత్పత్తికి కేంద్రం. దీనిపై ఆధారపడి వెయ్యి మందికిపైగా మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇక్కడ చేపలు, రొయ్యలు ప్రత్యేకం. వీటి ద్వారా ఏటా లక్షల రూపాయల వ్యాపారం సాగుతుంది. ఏటా సుమారు 100 నుంచి 200 టన్నుల చేపలు ఈ ప్రాజెక్టులో లభిస్తుండడం విశేషం. శనిగరం ప్రాజెక్టు వద్ద చేపల కొనుగోలుకు (ఫిష్ మార్కెట్) ఏర్పాటు చేయనున్నారు.

పర్యాటకుల తాకిడి

మండలంలోని శనిగరం ప్రాజెక్టు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. రాజీవు రహదారికి 2 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి మోయతుమ్మెద వాగు ప్రవాహం పెరిగడంతో ప్రాజెక్టు మత్తడి పోస్తోంది. ఎగువ ప్రాంతంలోని గుట్టల మధ్య వస్తున్న నీటితో శనిగరం ప్రాజెక్టు చూపరులను కట్టిపడేస్తోంది. ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో చెరువు అలుగు ప్రవాహం కాస్త తగ్గింది. పైనుంచి వస్తున్న కొద్దిపాటి జల సవ్వడులతో ప్రాజెక్టు నుంచి నీరు మత్తడి దూకుతుండడంతో చుట్టుపక్కల ప్రాంతాల వారు తరలివస్తున్నారు. గుట్టల మధ్యలో కనువిందు చేస్తున్న నీరు కిందకు జాలు వారుతుండడంతో ఆ నీటిలో తడుస్తూ ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ నూతన ఐబీ అతిథి గృహాన్ని నిర్మించనున్నారు. టూరిజం స్పాట్‌గా మార్చేందుకు కృషి చేస్తానని ఇటీవల చేపల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

అన్నదాతకు ఆదెరువు



ఈ చెరువు ద్వారా 5 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఈ ప్రాంతపు రైతులకు చెరువే ఆదెరువుగా మారింది. రెండు పంటలు పండుతున్నాయి. మా ఊరిలో ఈ చెరువు ఉండం అదృష్టం.

- గాజె సత్తయ్య, రైతు, శనిగరం

కాలువలు పునరుద్ధరించాలి



శనిగరం ప్రాజెక్టు నుంచి వచ్చే ప్రధాన కాలువలను పునరుద్ధరించాలి. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఈ కాలువలు పూడికతో నిండిపోయాయి. నాకు ఐదెకరాలు ఉండగా, మరో పదెకరాలు కౌలుకు తీసుకున్నా. చివరి భూములకు నీరు అందడం లేదు.

- పర్వేద కొమురయ్య, రైతు, తంగళ్లపల్లి

మాకు బతుకునిస్తోంది



శనిగరం చెరువు మాకు బతుకునిస్తోంది. మేం కొన్ని సంవత్సరాల నుంచి చేపల వేట సాగిస్తూ వందలాది మందిమి బతుకుతున్నాం. ఇది పెద్దచెరువు కావడంతో మాకు చేపలు, రొయ్యలు దొరుకుతున్నాయి. ఈ చెరువు రుణం ఎన్నటికీ తీర్చుకోలేం.

- నక్క శ్రీనివాస్, మత్స్యకారుడు, శనిగరం

పత్తి రైతు పరేషాన్

ఐదో పేజీ తరువాయి

తెలిపారు. మొదటి విడతలో 16 పత్తి మిల్లులకు అనుమతి వచ్చింది. రెండో విడతలో మరో ఎనిమిదికి సీసీఐ అనుమతి రానున్నది. గత నెల 29న హుస్నాబాద్‌లో సీసీఐ కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కలెక్టర్ మనుచౌదరి ప్రారంభించారు. జిల్లాలో ఇది ఒకటి తప్ప ఇంతవరకు మిగతా కేంద్రాలను ప్రారంభించ లేదు. కేంద్రాల ప్రారంభానికి మరో వారం రోజుల పట్టే అవకాశం ఉన్నదని తెలుస్తుంది. .


ఇటీవల హుస్నాబాద్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం, కలెక్టర్

తేమ శాతంతో కొర్రీలు

పత్తి కొనుగోళ్లలో ఏటా తేమ సమస్య తలెత్తుతోంది. శీతాకాలం ప్రారంభం కావడంతో పత్తిలో తేమశాతం పెరుగుతుంది. సీసీఐ నిబంధనల ప్రకారం తేమశాతం 8 నుంచి 12 శాతంలోపు ఉంటేనే పత్తి కొనుగోలు చేస్తారు. అంతకంటే అధికంగా ఉంటే క్వింటాల్‌కు ఒక పాయింట్ చొప్పున కోత విధిస్తారు. రైతులు పత్తిని ఆరబెట్టి తెస్తేనే మద్దతు ధర లభించే అవకాశాలు ఉన్నాయి. తేమ కొర్రి చూపుతూ కోత విధించడంతో ఏటా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

రూ.6 వేలకు విక్రయించాను

ప్రభుత్వ సెంటర్లు ప్రారంభించకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు పత్తిని విక్రయించాను. నాణ్యమైన పత్తిని క్వింటాలుకు రూ.6 వేలకు ఆరు క్వింటాళ్లు అమ్ముకున్నాను. క్వింటాలుకు రూ.1500 చొప్పున రూ.9 వేలు నష్టపోయాను. సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదు.

- అచ్చినా నర్సయ్య, రైతు